క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ప్లీనరీ

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించే ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాఘువేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. బాలాపూర్ వెళ్లేదారిలో ఇండియన్ పెట్రోల్ బంకు పక్కన ఉదయం 9.30 గంటలకు సభను నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిలుగా మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలు హాజరుకానున్నారని చెప్పారు. కావున కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మామిడిపల్లి కొండల్లో షూటింగ్ సందడి


రహదారిపై వేస్తున్న లైటింగ్ సెట్టింగ్

పహాడీషరీఫ్: ఇప్పటి వరకు మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వస్వామి ఆలయం వద్ద నెలకొన్న సీరియల్, సినిమా షూటింగుల సందడి.. తాజాగా గుట్టల పైకి చేరింది. ఐటీ కంపెనీల కోసం కొండలపై విశాలమైన రహదారులు నిర్మించగా.. ప్రస్తుతం పెద్దగా వాహనాల రాకపోకలు లేవు. దీంతో రాత్రి పూట షూటింగ్ కోసం రెండు రోజులుగా భారీ సెట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు వరుసల రహదారులు కలుసుకునే కూడలిలో లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా.. ఈ సెట్‌లో పవన్ కల్యాణ్ చిత్రం చిత్రీకరించనున్నట్లు సమాచారం.

గృహిణి అదృశ్యం


సావిత్రి (ఫైల్)

మహేశ్వరం: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మహేశ్వరం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన మాడుగుల సావిత్రి(42) ఈ నెల 23న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు సురేశ్ సోమవారం మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

భక్తి శ్రద్ధలతో ఆరాధన మహోత్సవం


సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మీర్‌పేట: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 12వ ఆరాధన మహోత్సవాలను సోమవారం మీర్‌పేట శివసాయినగర్ కాలనీ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సంకీర్తన, రుద్రం, మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సమితి మీర్‌పేట సభ్యులు ఎర్రయ్య, కృష్ణమూర్తి, శివానందం, రామకృష్ణ, డా.కృష్ణప్రసాద్, విజయ్‌కుమార్, అశోక్, రమేష్, బాపిరాజు కృష్ణారావు, రమణ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని ఇంజాపూర్ గ్రామానికి చెందిన మహాలక్ష్మి నగర్ కాలనీలో ప్రారంభించిన శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.

షర్మిల అరెస్ట్ సరికాదు

వైఎస్సార్‌టీపీ నేత సుమన్‌గౌడ్



పహాడీషరీఫ్: ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలను అరెస్టు చేయడం సరికాదని పార్టీ రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ జి.సుమన్‌గౌడ్ అన్నారు. మామిడిపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించేందుకే కుట్రలు చేస్తున్నారన్నారు. బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్


విరాళం అందజేస్తున్న తూళ్ల వీరేందర్‌గౌడ్

మహేశ్వరం: సేవాలాల్ మహారాజ్ ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నాగారం పంచాయతీ అనుబంధ గ్రామం తీగలకుంట తండాలో నిర్మించ తలపెట్టిన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మాణానికి విరాళం అందించి తండావాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్, యాడిమేరమ్మ ఆలయాలను సమష్టిగా కలిసి నిర్మించుకునేందుకు తండావాసులు ముందుకురావడం అభినందనీయమన్నారు. మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ 70వ జన్మదినం పురస్కరించుకుని ఏడాది పొడవురా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. తీగలకుంట తండాలో 70రకాల పండ్ల మొక్కలను గిరిజనులతో కలిసి నాటారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దేశ్యానాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాధవాచారి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కుండె కుమార్, చిన్నతూప్ర సర్పంచ్ కొండ రఘుపతిగౌడ్, నాయకులు బస్వ రఘుగౌడ్, గొల్లూరు శ్రీశైలం, కుండె సురేశ్, వినోద్ నాయక్, రాజు నాయక్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం రాత్రి పూర్వ విద్యార్థుల స మ్మేళనం ఏర్పాటు చేశారు. 1989–90వ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆవుల శివాజీ ఫంక్షన్ హా ల్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.


ఉపాధ్యాయులతో 1989-90 బ్యాచ్ అమీర్‌పేట్ జెడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులు

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

హుడాకాంప్లెక్స్: జేఎన్ఎన్‌యూఆర్ఎంలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ నందనవనానికి చెందిన లబ్ధిదారులు సోమవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇళ్లకోసం 512 కుటుంబాలు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి నిరసన తెలపగా.. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ వచ్చి.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని వాపోయారు. ఇస్తామన్న ప్రాంతంలో ఇళ్లు ఇవ్వకుండా.. మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ, వనస్థలిపురం రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో కేటాయించారని, తాము అక్కడికి వెళితే అక్కడి ఎరుకల సంఘాలు మాపై దాడికి వస్తూ, ఇక్కడకు రావొద్దని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. నందనవనంలోనే నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించేలా అధికారులు చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, రమేష్, స్వామినాథ్, జమీల్ మీరా, స్వామి, భాస్కర్‌నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.1300కోట్లతో అభివృద్ధి పనులు

బీఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ కార్తీక్‌రెడ్డి


అభివృద్ధి పనులను ఫొటోలతో వివరిస్తున్న కార్తీక్‌రెడ్డి

మీర్‌పేట: నాలుగేళ్లలో మంత్రి సబితారెడ్డి దాదాపు రూ.1300 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారని బీఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీర్‌పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల స్థాయిలో మంత్రి సబితారెడ్డి మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. మంత్రికి ఎలాంటి వ్యాపారాలు లేవని.. 24 గంటలు ప్రజల మధ్యే ఉంటూ.. ప్రజాసేవకురాలిగా పని చేస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో రైతుబీమా, రైతుబంధు, దళితబంధు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, గొర్రెల పంపిణీ, సీఎంఆర్ఎఫ్, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్‌ల ద్వారా 90వేల మంది నేరుగా లబ్ధి పొందారని వివరించారు. మన ఊరు–మనబడి పథకంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.80 కోట్లతో పాటు సీఎస్ఆర్ ఫండ్ కింద మరో రూ.10 కోట్లు, హెచ్ఎండీఏ నుంచి మున్సిపాలిటీలకు అదనంగా రూ.184 కోట్లు, మండలాల్లో అభివృద్ధి కోసం ఆర్అండ్‌బీ నుంచి రూ.432 కోట్ల ప్రత్యేక నిధులను తీసుకువచ్చారని గుర్తు చేశారు. మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గంలో స్థిరాస్తుల విలువ ఎంత మేర పెరిగిందో మంత్రి చేసిన అభివృద్ధే నిదర్శనమని అన్నారు. అదే విధంగా నూతన భవనాల నిర్మాణానికి రూ.165 కోట్లు, ముంపు సమస్యను శాశ్వత పరిష్కారించేందుకు ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణానికి రూ.92 కోట్లను మంత్రి మంజూరు చేశారన్నారు. అబద్ధాల పునాదుల మీద రాజకీయాలు చేస్తే ఎక్కువ రోజులు నిలబడదని.. సమస్యపై కొట్లాడితే ప్రజల్లో గుర్తింపు వస్తుందని కార్తీక్‌రెడ్డి హితవు పలికారు. నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించిన వారికి మంత్రి తీసుకువచ్చిన రూ.1300కోట్ల నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించిన ట్లో ప్రతులను పంపిస్తున్నానని ఇందులో అబద్ధాలు ఉంటే నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి మాట్లాడనని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు అరవింద్‌శర్మ, బాలకిషన్, యువజన విభాగం అధ్యక్షుడు ముద్దా పవన్‌కుమార్, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల అధ్యక్షులు అర్కల కామేశ్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి పాల్గొన్నారు.

వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట లక్ష్మీనరసింహా స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి మే 5 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవ వాల్‌పోస్టర్‌ను మంత్రి సబితారెడ్డి నగరంలోని ఆమె నివాసంలో ఆలయ పాలక మండలి సభ్యులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఉత్సవ నిర్వాహకులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, బీఆర్ఎస్ నాయకుడు జిల్లాల లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్ సుమన్, నాయకులు సురేందర్, శ్రీకాంత్, నగేష్, నవీన్, నర్సింహ్మా, సురేష్, రవి, మహేశ్, ఆలయ పూజారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని పోలీసులకు అప్పగించిన ఆటోడ్రైవర్లు


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: తప్పిపోయిన ఓ బాలుడిని ఆటో డ్రైవర్లు చేరదీసి వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పనామా చౌరస్తా దగ్గర ఉన్న ఆటోస్టాండ్ ప్రాంతంలో గుర్తు తెలియని ఐదేళ్ల బాలుడు అనూష్ (5) తచ్చాడుతుండగా ఆటో డ్రైవర్లు ఖాదర్, శ్రీను గమనించి చేరదీశారు. సోమవారం సాయంత్రం అతడిని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జలేంధర్‌రెడ్డికి అప్పగించారు. బాలుడితో మాట్లాడిన సీఐ అతడి వివరాలు తెలుసుకున్నారు. తండ్రి నవీన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు. తప్పిపోయిన బాలుడ్ని గుర్తించి పోలీసులకు అప్పగించిన ఆటోడ్రైవర్లు ఖాదర్, శ్రీనులను సీఐ జలేంధర్‌రెడ్డి అభినందించారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: అంధత్వ నివారణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో సర్పంచ్ రామునాయక్‌తో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పేదల ఆరోగ్యమే లక్ష్యంగా కంటి వెలుగు, బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నోస్టిక్స్, మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్ నాయక్, ఉప సర్పంచ్ శిరీష, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాపాలలో..

మంచాల: మండల పరిధిలోని జాపాల గ్రామంలో సర్పంచ్ వాహిదా బేగం, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లప్ప, డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘జనప్రియ హోమ్స్’లో కార్పొరేటర్ పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

వనస్థలిపురం: జనప్రియ హోమ్స్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్–రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి జనప్రియ హోమ్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ సాయి శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ ప్రజ్ఞ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీ అధ్యక్షుడు పవన్, నాయకులు చిన్నయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించండి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వీఓఏలు చేపట్టిన సమ్మె సోమవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వీఓఏలకు పనికితగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, రూ.10లక్షల ఆరోగ్యబీమా, అర్హులకు సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వీఓఏలు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, నాయకులు యాదయ్యగౌడ్, రాజేశ్, ఇమ్రాన్, చంద్రశేఖర్, రవి, యాదయ్య, శ్రీకాంత్, విజయ్, భానుకిరణ్, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య, సభ్యులు కవిత, అనుసూయ, సుధారాణి, శోభ, సునీత, అరుణ, కృష్ణవేణి, విజయ్, సుమన్, శ్రీలత, తానేశ్, ఇదమయ్య, శత్రు పాల్గొన్నారు.

‘ఈటల’ దిష్టిబొమ్మ దహనం

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కుమ్మక్కై, రూ.25 కోట్లు తీసుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపణలు చేయడాన్ని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఖండించారు. ఇందుకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో పార్టీనాయకులతో కలిసి ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజేందర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, చంద్రశేఖర్, రాజేశ్, యాదయ్యగౌడ్, ఇమ్రాన్, ఇమ్రాన్, విజయ్, మల్లయ్య,భానుకిరణ్, రవి, శ్రీకాంత్, రమేశ్, చంద్రశేఖర్, సత్యం, మహేశ్ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న వీఓఏలు

సామాజిక సేవే లక్ష్యం

విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి డాక్టర్ ఉమర్ వలీషా


దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఉమర్ వలీషా

మహేశ్వరం: ఆధ్యాత్మిక విలువలున్న చోట మానవత్వం, శాంతి, సంతోషం, ఆరోగ్యం, సహనం వెల్లివిరుస్తుందని శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి డాక్టర్ ఉమర్ వలీషా అన్నారు. సోమవారం ఘట్టుపల్లి శివారులోని శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో భక్తులతో కలిసి వైశాఖమాసం సభను నిర్వహించారు. అనంతరం పక్షులకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మిక జ్ఞానం తప్పనిసరియన్నారు. ఏ మతమైనా ఎంచుకునే దారులు వేరైనా చేరే మార్గం ఒక్కటే అన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా తమ పీఠం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్సవ, హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత, వ్యవసాయ వర్సిటీ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త శ్రీరామరాజు, ఆశ్రమం నిర్వాహకులు సూర్యలత, శేషకుమారి పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా మారిందని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, డైరెక్టర్లు ఆనంద్, దేవులానాయక్, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, దేవేందర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, సోషల్‌మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శి వెంకటేశ్, మండల కోశాధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కార్పొరేట్’ సేవలు అభినందనీయం


పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

సర్కారు బడుల అభివృద్ధికి రూ.80 లక్షలు కేటాయించిన అమేజాన్

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛందంగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి కొనియాడారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సూచనలతో సెర్ఫ్ ఆర్గనైజేషన్ (అమేజాన్) సంస్థ నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరుద్ధరణకు రూ.80 లక్షలు కేటాయించింది. సోమవారం సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ శమంత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులతో కలిసి పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ సురేష్, అర్జున్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వార్డు సభ్యులు ఎండీ అఫ్జల్‌బేగ్, వెంకటేశ్, కరుణాకర్‌రెడ్డి, మత్యాస్‌రెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, గణేశ్, ఆంజనేయులు, లక్ష్మణ్, నల్లి శ్రీధర్, మైసయ్య, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.